క్లుప్తంగా

మండలంలో 98 శాతం పింఛన్ల పంపిణీ



పెనుగంచిప్రోలు: మండలంలో గురువారంతో సామాజిక పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు. మండలంలోని శివాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ధారావతు పావని.. రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు భూలక్ష్మికి ఆస్పత్రికెళ్లి పింఛన్ అందించారు.

ముగిసిన సత్యమ్మ జాతర

నందిగామ: సత్యమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీ ప్రారంభమైన జాతర మహోత్సవాల్లో చివరి రోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రాల నడుమ పూర్ణాహుతి జరిగింది. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

కంచికచర్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. కంచికచర్ల విజయరాణి స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం పరిశీలించారు. తొలుత పరీక్ష కేంద్రాల వద్ద వసతులు పరిశీలించారు. హిందీ పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఇన్విజిలేటర్లను కోరారు.

బాబాకు విశేష పూజలు

నందిగామ: రామలింగేశ్వరనగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పౌర్ణమి గురువారం నేపథ్యంలో బాబాకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్, ఫణికుమార్ బాబాకు సహస్ర నామార్చన జరిగింది. సాయంత్రం పాదుకులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ చేశారు. పట్టణంలోని చెరువుబజారు, అశోక్‌నగర్ ప్రాంతంలోని బాబా ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

నందిగామ: హనుమజ్జయంతి నేపథ్యంలో మండలంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమంతుపాలెం శివారు కె. కంద్రిక ప్రాంతంలోని దాసాంజనేయ స్వామికి, పట్టణ శివారు గాంధీనగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, చందమామపేటలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, ఆకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

తిరుమలగిరిలో అన్నసమారాధన



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు గురువారం సప్తకలశస్నపన, హోమం, బలిహరణ, ప్రాతఃకాలార్చనలు, పుష్పాలంకరణ వంటి కార్యక్రమాలను అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు చేశారు. ఆలయ ఏసీ దాసర శ్రీరామవరప్రసాదరావు, కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, పాలక వర్గ సభ్యులు పి.శ్రీనివాసరావు, వై.ఉషారాణి, వెంకటేశ్వర్లు, నాగయ్య ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి ఏడు గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మానికి చెందిన కళాకారులతో కోలాటం, నృత్యప్రదర్శన కార్యక్రమాలు చేశారు.

స్వచ్ఛ జలం అందించడమే లక్ష్యం



నందిగామ: పట్టణ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 19వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. స్థానికులకు సరఫరా అవుతున్న తాగునీటిని పరిశీలించి ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నీటిని క్లోరినేషన్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వైద్య సేవలు

'ఫ్యామిలీ డాక్టర్'లో ప్రజాప్రతినిధులు



జగ్గయ్యపేటలో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: ఉన్న ఊరిలోనే మంచి వైద్యాన్ని ఇంటింటికీ అందించాలనే మంచి కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అని ఇది దేశంలోనే చారిత్రాత్మకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా పట్టణంలో బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన 104 వాహనాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు జగనన్న పాలనలో మీ ఊర్లోనే మీ వద్దకే ఉచిత వైద్యం అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్యసేవలు అందించి చరిత్ర సృష్టించారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి మంచానికే పరిమితమైన రోగులకు సైతం వారి గ్రామంలోనే వారి గడప వద్దనే అవసరమైన వైద్యం అందజేయాలన్న తపనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి మండలంలో పీహెచ్‌సీలకు 104 వాహనాన్ని అనుసంధానం చేస్తారని తెలిపారు. ఒక డాక్టర్ వైద్యశాలలో ఉండగా మరొక వైద్యుడు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఒక గ్రామానికెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. మండలంలోని బలుసుపాడులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ నళినీదేవి, సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాష్, వైద్యులు అనీల్‌కుమార్, స్రవంతి, నాగరాణి, సీహెచ్‌ఓ లక్ష్మి, వెంకట్రావు, నాగిరెడ్డి, మాతంగి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య రంగంలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని సర్పంచ్ జ్యోతిబ్రహ్మం అన్నారు. గురువారం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి ప్రభుత్వం కొత్తగా కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటికే 108, 104 సర్వీసుల ద్వారా, ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజన, గ్రామస్తులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించి విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోదాడ రోడ్డులోని బి కన్వెన్షన్ హాల్‌లో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, ఏటిపట్టు గ్రామాల మండలాల సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి సంబంధించి ఫొటోలను, వివిధ పథకాల ద్వారా లబ్ధి పొంది వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా బలపడిన లబ్ధిదారుల జీవిన చిత్రాన్ని వారి మాటల్లోనే ఎల్‌సీడీ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చామని, ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ యువ నేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పార్టీ జిల్లా యూత్ ప్రెసిడెంట్ కొరివి చైతన్య, మండలాల సచివాలయ కన్వీనర్లు దొంగల జానకిరామయ్య, కన్నమాల శామ్యూల్, లేళ్ల నాగేందర్‌రెడ్డి, దేవినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీకి చెందిన పలు విభాగాలకు నూతన సారథులను నియమించారు. ఈ సందర్భంగా గురువారం బి.కన్వెన్షన్ హాల్‌లో వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు పనిచేసిన చిలుకూరి శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా నియమించారు. పేట మండల పార్టీ అధ్యక్షుడుగా మండవ శ్రీనివాసగౌడ్‌ను, పేట మండల రైతు విభాగం అధ్యక్షుడుగా పల్లెబోయిన యలమందరావు, గండ్రాయి గ్రామ పార్టీ అధ్యక్షుడుగా కనపర్తి ప్రసాద్ నియమితులయ్యారు. వీరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉదయభాను కోరారు. నేతలు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన ముఖ్యం

జగ్గయ్యపేట అర్బన్: యువత జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే సమయ పాలన అవసరమని, దీంతో వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవచ్చని విజయవాడలోని మహిత ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ ఎ.మాధవరావు తెలిపారు. గురువారం సెయింట్ ఆన్స్ అమెరికన్ హాస్పిటల్ అనుబంధ విభాగం సెయింట్ ఆన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యువతకు వ్యక్తిత్వ వికాసంపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని ఎలా కాపాడుకోవాలో పలు సృజనాత్మక ఆటలు, కార్యకలాపాలతో అవగాహన కల్పించారు. సంస్థ యూత్ ప్రోగ్రాం ఇన్‌చార్జులు సిస్టర్ ఫెలిస్టా, సిస్టర్ నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువతీయువకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్లకు ప్రతి నెల 1వ తేదీన పింఛన్ నగదు చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు కోరారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి నాగేశ్వరరావు, సంఘ నాయకులు చాపలమడుగు స్వర్ణలత, పెద్దినీడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన పట్టణ ఆరోగ్య కేంద్రాలు

నందిగామలో రూ.1.74 కోట్ల వ్యయ అంచనాతో రెండు భవనాల నిర్మాణం



డీవీఆర్ కాలనీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం

నందిగామ: ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు అందుబాటులో ఉండేలా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తోంది. దీనిలో భాగంగా నందిగామ పట్టణంలో రెండు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

పూర్తయిన భవన నిర్మాణాలు

నందిగామ మున్సిపాలిటీ పరిధిలో 50 వేల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి రెండు నియోజకవర్గాల స్థాయిలో సేవలందిస్తోంది. ప్రజలకు వైద్య సేవలను మరింత దగ్గర చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. ముఖ్యమంత్రి డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలతో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు కూడా వైద్యుడు కావడంతో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కూడా ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పట్టణానికి రెండు ప్రైమరీ హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయి. రూ 1.74 కోట్ల వ్యయ అంచనాతో పట్టణంలోని డీవీఆర్ కాలనీలో, పట్టణ శివారు అనాసాగరంలో నిర్మించారు. ఇప్పటికే వీటిని నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇవి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు

పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా స్థానికులకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందనున్నాయి. వీటిలో ప్రత్యేక వైద్యులు, సిబ్బంది కూడా 24 గంటలు అందుబాటులో ఉంటారు. 30 రకాలకు పైగా టెస్టులను కూడా ఆరోగ్య కేంద్రంలోనే చేయనున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న రెండు కేంద్రాల్లో ఒక్కొక్క దానిలో ఒక హాల్, ఆరు గదులు ఏర్పాటు చేశారు. ల్యాబ్‌తోపాటు అవసరమైతే ఇన్‌పేషెంట్ సేవలు కూడా అందనున్నాయి. ప్రతి ఇంట్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులు, వారి వయసు, వారికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షణ నిర్వహించి అవసరమైన వారికి వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నారు. ఇది ప్రారంభమయ్యాక ప్రజలకు వైద్య సేవలు మరింత దగ్గర కానున్నాయి.

వైద్య సేవలు మరింత చేరువ



ప్రజలకు వైద్య సేవలను మరింత దగ్గర చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. నందిగామ పరిధిలో రెండు ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రారంభమవుతాయి. దీంతో వైద్యసేవలు మరింత చేరవవుతాయి.

– డాక్టర్ జయరాం, మున్సిపల్ కమిషనర్, నందిగామ

మాలాంటి వాళ్లకు ఎంతో ప్రయోజనం



ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకు రావడంతో మాలాంటి వృద్ధులకు ప్రయోజనం. స్థానికంగానే ఆరోగ్య కేంద్రం ఉండటంతో ఏదో ఒక టైంలో వెళ్లి చూపించుకొని మందులు తెచ్చుకోవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధి పీడితులకు తరచూ ఉచితంగా పరీక్షలు చేస్తూ మందులు ఇవ్వడంతో ఎందరికో మేలు జరుగుతుంది.

– గోపు సుబ్బమ్మ, డీవీఆర్ కాలనీ, నందిగామ

ప్రభుత్వ పథకాలను వివరించాలి



గొట్టుముక్కలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

గొట్టుముక్కల(కంచికచర్ల): గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పని తీరుపై ప్రజల అభిప్రాయం సేకరించాలని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో గురువారం రాత్రి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగన్ మా భవిష్యత్ నువ్వే జగనన్న అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుదే సరస్వతి, మండల గృహసారథుల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు గుదే రంగారావు, గుదే అక్కారావు, మంగలపూడి కోటిబాబు, తంగెళ్లమూడి రామారావు, గుదే శివయ్య తదితరులు పాల్గొన్నారు. కంచికచర్లలో శుక్రవారం నుంచి చేయనున్న మా నమ్మకం నువ్వే జగన్ మా భవిష్యత్ నువ్వే జగనన్న అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు అన్నారు.

త్యాగనిరతికి ప్రతీక రంజాన్



నందిగామ టౌన్: రంజాన్ పండుగ త్యాగనిరతికి ప్రతీకని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. అడవిరావులపాడు గ్రామంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు సహాయత ట్రస్ట్ సౌజన్యంతో అందించిన రంజాన్ తోఫాను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ తోటి వారికి సాయపడటమే ఇస్లాం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మంచాల చంద్రశేఖర్, కందుల నాగేశ్వరరావు, నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, ట్రస్ట్ ప్రతినిధులు మౌలానా ఇసాక్ సాహెబ్, షేక్ మిన్‌హజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని దుర్గాపురం ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆరు సచివాలయాలకు రూ 1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన సచివాలయాల పరిధిలో ప్రజలు కోరిన పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, ఖాదర్‌బాబు, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీ ప్రసాద్, చిరంజీవి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్రం తీరుతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం'

కంచికచర్ల: కేంద్రం తీరుతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. కంచికచర్ల రాజీవ్ గాంధీ విగ్రహం సెంటర్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందా వజ్రయ్య ఆధ్వర్యంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా గురువారం రాత్రి కాగడాలతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాస్, దేవరకొండ శ్రీనివాసరావు, అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అఖిలాండేశ్వరికి నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం పలువురు నృత్యకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. విజయవాడకు చెందిన భారతి రాఘవ నృత్య కేంద్రానికి చెందిన నవ్యశ్రీ, సాత్విక, ఆరాధ్య, పూర్ణ, లహరి, యువశ్రీ, శరణ్యారి, దివ్య, కీర్తి, ఏక్షిత, హేమ, గగనలు పలు కీర్తనలకు నృత్యాలు ప్రదర్శించారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందించారు.

రమణీయం.. కమనీయం..





వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం జరిగింది. ప్రభుత్వం తరఫున ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ ప్రాంతం వేంకట రమణుడి నామస్మరణతో మార్మోగింది. ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–తిరుమలగిరి(జగ్గయ్యపేట)

బాటసారుల దాహార్తి తీర్చడానికే..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: బాటసారుల దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. కస్తాల మరియమ్మ, మొండితోక కృష్ణల జ్ఞాపకార్థం వైఎస్సార్ సీపీ నాయకుడు వినుకొండ రామారావు ఆధ్వర్యాన స్థానిక గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, బొల్లినేని శ్రీనివాసరావు, కందుల నాగేశ్వరరావు, మారం అమరయ్య, వీసం దుర్గారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసు నిఘా

డీసీపీ మేరీ ప్రశాంతి



నందిగామలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న డీసీపీ

నందిగామ: జిల్లాలో టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేశామని డీసీపీ మేరీ ప్రశాంతి అన్నారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మహిళా పోలీసు సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయించామన్నారు. ఆమె వెంట ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ సతీష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో బెస్ట్ సీఎం



పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు: సంక్షేమ పథకాల అమలులో జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే బెస్ట్ సీఎం అని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్వరరావుకు డయాలసిస్ కింద కొత్తగా మంజూరైన నెలకు పింఛన్ రూ.10 వేలను గురువారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందుతూనే ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.